క్లుప్తంగా

13తో గడువు ముగింపు


ఏఓ శ్రీనాథ్

సిద్దిపేటఅర్బన్/వర్గల్(గజ్వేల్)/ మిరుదొడ్డి(దుబ్బాక)/కొండపాక(గజ్వేల్): కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు, ఇంత వరకు రైతు బీమా చేసుకోని రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని సిద్దిపేట అర్బన్ మండల ఏఓ బి.శ్రీనాథ్, వర్గల్ మండల వ్యవసాయాధికారి శేషశయన, మిరుదొడ్డి, కొండపాక వ్యవసాయ అధికారులు సత్యాన్వేష్, గోవిందరాజు సూచించారు. ఆదివారం వారు మాట్లాడుతూ జూన్ 5లోగా పట్టా పాస్‌పుస్తకం వచ్చినవారు దరఖాస్తుకు అర్హులన్నారు. దరఖాస్తు ఫారంతోపాటు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు జతచేయాలని, 1966 ఆగస్టు 14 నుంచి 2007 ఆగస్టు 14 మధ్య పుట్టిన వారు మాత్రమే బీమాకు అర్హులని తెలిపారు. ఆధార్‌కార్డులో 18 సంవత్సరాలు నిండి 59 సంవత్సరాలలోపు ఉన్న రైతులు 13వ తేదీ లోగా తమ దరఖాస్తులను సంబంధిత ఏఈఓలకు అందజేయాలని సూచించారు. బీమా పథకంలో ఏవైనా మార్పులు అవసరమైతే ఆగస్టు 12వ తేదీలోపు సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారులను సంప్రదించాలని సూచించారు.

పీఆర్టీయూ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా లక్ష్మీనారాయణ


నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పీఆర్టీయూ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్‌గా లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు నారాయణరావుపేట మండలం ఎదుల్లవాడ పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి శశిధరశర్మ, రాష్ట్ర నాయకుడు వంగ మహేందర్‌రెడ్డి ఆదివారం నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ


పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న సుధాకిరణ్

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుగ్గిల్ల గ్రామ పరిరక్షణ సమితి గౌరవ అధ్యక్షుడు నచ్చరాజు సుధాకిరణ్ ఆధ్వర్యంలో గ్రామంలోని నిరుపేదలకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన తండ్రి వెంకటకిషన్‌రావు ఘాట్ వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. గ్రామ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ పరిరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పుస్తె, మెట్టెలు అందజేత


పుస్తె, మట్టెలు అందజేస్తున్న ప్రవీణ్

చిన్నకోదూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గోనెపల్లికి చెందిన బొగ్గుల నారాయణ కూతురు తేజస్విని వివాహ నిమిత్తం మాజీ ఎమ్మెల్యే కూర రఘోత్తంరెడ్డి పుస్తె, మెట్టెలు, ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన తాళ్లపల్లి ప్రవీణ్ చేతుల మీదుగా ఆదివారం వధువుకు వాటిని అందజేశారు.

మిత్రుడి కుటుంబానికి స్నేహితుల అండ


డిపాజిట్ పత్రాన్ని అందజేస్తున్న స్నేహితులు

మిరుదొడ్డి(దుబ్బాక): అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. అక్బర్‌పేట- భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్‌లో 2000–01 పదోతరగతి బ్యాచ్‌లో ఒకరైన తాళ్లపల్లి రాజు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. దీంతో మిత్రుడి కటుంబాన్ని ఆదివారం వారు పరామర్శించి 50కిలోల బియ్యం అందజేశారు. అలాగే అతడి కూతురు స్వాతి పేరున రూ.25 వేలు డిపాజిట్ చేసిన పత్రాన్ని అందజేశారు. పరామర్శించిన వారిలో రాజనర్సింహారెడ్డి, అహ్మద్, రమేష్, మహేందర్‌రెడ్డి, రమేష్, భూపతి, హిమకర్, పరశురాములు, స్వామి, భాస్కర్, రవి, చంద్రశేఖర్, గణేష్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

పత్తిలో సస్యరక్షణ తప్పనిసరి

అధిక దిగుబడికి బాటలు

- తోర్నాల శాస్త్రవేత్త, డా.పల్లవి
- ఆశిస్తున్న పురుగులు
- నివారణకు ఇదే అదను


పత్తిలో సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

మిరుదొడ్డి(దుబ్బాక): వర్షాధార పంటల్లో పత్తిసాగు ముఖ్యమైంది. పత్తికి మార్కెట్లో చాలా డిమాండ్ ఉండటంతో రైతులు పత్తిసాగుకే మొగ్గుచూపుతున్నారు. పత్తి విత్తిన తర్వాత ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో సాగుకు పచ్చదోమ, పేనుబంక, తామర, తెల్లదోమలు, ఎర్రనల్లి, పిండినల్లి, కాండం తొలుచు పురుగులు, కాండపు ముక్కు పురుగులు, పొగాకు లద్దె పురుగులు, శనగపచ్చ పురుగులు ఆశిస్తాయి. అయితే ప్రాథమిక దశలోనే గుర్తించి సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టక పోతే నష్టాలను చవి చూడాల్సి వస్తుందని ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్, తోర్నాల వ్యవసాయ శాస్త్రవేత్త డా.సీహెచ్.పల్లవి తెలియజేస్తున్నారు.

పచ్చ దోమలు, పేనుబంక: ఆకుల అడుగు భాగంలోని రసాన్ని పీల్చివేయడంతో అవి దోనెలుగా ముడుచుకుపోయి లేత పసుపురంగులోకి మారి, ఆకుల అంచులు ఎర్రబడి ఎండిపోయి రాలిపోతాయి. నివారణ కోసం కాండాలకు మందు పూసేలా చర్యలు చేపట్టాలి. 30 నుంచి 45 రోజులలో మోనోక్రోటోఫాస్, నీరు 1:4 నిష్పత్తిలోను; 60 రోజుల తర్వాత ఇమిడోక్లోప్రిడ్, నీరు 1:20 నిష్పత్తిలోను పూయాలి. లేదా లీటర్ నీటికి 5 శాతం వేప కషాయం లేదా వేప నూనెను 5మి.లీ. వాడుకోవాలి.


డాక్టర్ సీహెచ్. పల్లవి

తామర పురుగులు: ఈ పురుగులు పసుపు, గోధుమ వర్ణంలో సన్నగా ఉంటాయి. తామర పెద్ద పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి ఆకులను గీకి రసాన్ని పీలుస్తాయి. నివారణకు మోనోక్రోటోపాస్ 1.6 మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తెల్లదోమ: సాగులో పిందె, కాయదశలో ఎక్కువగా కనిపిస్తుంది. తల్లి, పిల్ల పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చివేస్తాయి. ఆకులు పచ్చదనం కోల్పోయి రాలిపోతాయి. నివారణకు లీటర్ నీటికి ఫిప్రోనిల్ 2 మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఎర్రనల్లి: తల్లి, పిల్ల పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి సాలీడు గూళ్ళను తయారు చేసి ఆకుల నుంచి రసం పీల్చివేస్తాయి. వీటి నివారణకు నీటిలో కరిగే 3 గ్రా. గంధకం లేదా స్పైరోమెసిఫెన్ 1 మి.లీ. లేదా డైకోఫాల్ 5 మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పిండినల్లి: పిండినల్లి పురుగులు లేత పసుపు రంగుతో కూడిన తెలుపు రంగులో ఉంటాయి. తల్లి పురుగులు రెక్కలు లేకుండా ఒళ్ళంతా వెంట్రుకలు కలిగి ఉంటాయి. ఆకుల తొడిమెలు, పూత, కాయల నుంచి రసాన్ని పీలుస్తాయి. దీంతో ఆకులపై పసుపురంగు మచ్చలు ఏర్పడతాయి. సాండోవిట్ లాంటి జిగురు మందును 1 మి.లీ. చొప్పున ఒక లీటర్ నీటికి కలిపి మొక్కలు పూర్తిగా తడిచే విధంగా పిచికారీ చేయడం ద్వారా నివారించవచ్చు.

కాండం తొలుచు పురుగులు: ఈ పురుగుల లార్వాలు కాండాల మధ్య భాగాన్ని తినివేస్తాయి. పత్తి మొక్కల వద్ద రంపపు పొట్టులా పడి ఉండటాన్ని గమనిస్తే కాండం తొలుచు పురుగుల ఉనికిని గుర్తించవచ్చు. నివారణకు ఆక్సీడెయటాన్ మిథైల్ 2 మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే కొంత మేరకు పురుగుల ఉధృతి తగ్గుతుంది.

కాండపు ముక్కు పురుగులు: లార్వాలు కాళ్ళు లేకుండా లేత పసుపు రంగులో ఉంటాయి. ఇవి మొక్కల మొదలు భాగంలో చిన్న చిన్న రంధ్రాలు చేసి కాండంలోకి ప్రవేశిస్తాయి. లీటర్ నీటికి మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. క్లోరిఫైపాస్ 2.5 మి.లీ. కలిపి మొక్కల మొదళ్ళ వద్ద పిచికారీ చేయాలి.

పొగాకు లద్దె పురుగులు: ఈ పురుగులు సాగులోని అన్ని దశల్లో ఆశించి పంటను విపరీతంగా నష్టపరుస్తుంది. వీటి నివారణకు ఎకరానికి 10కిలోల తవుడు, 2కిలోల బెల్లం, ఒక లీటర్ మోనోక్రొటోఫాస్ లేదా 750 మి.లీ. క్లోరిపైఫాస్ లేదా 300 గ్రా. థయోడికార్బ్ మందుకు సరిపడా నీటిని కలిపి చిన్నచిన్న ఉండలుగా చేసి సాయంత్రం పూట పొలంలో చల్లుకోవాలి.

శనగపచ్చ పురుగులు: తల్లి పురుగులు లేత భాగాలపై తెల్లని గుడ్లను విడివిడిగా పెడతాయి. గుడ్ల నుంచి వచ్చిన లార్వాలు ఆకులు, పూత, కాయలను ఆశించి రంధ్రాలు చేస్తాయి. వీటి నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లేదా ట్రైజోఫాస్2 మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు, 100 బంతి మొక్కలను నాటుకోవాలి.

కాంగ్రెస్ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నా..


చక్రధర్‌గౌడ్

సిద్దిపేటకమాన్: కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని ఆ పార్టీకి చెందిన నాయకుడు చక్రధర్‌గౌడ్ తెలిపారు. సిద్దిపేటలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మైనంపల్లి హన్మంతరావు వైఖరి వల్లే తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. సుమారు 16 నెలలపాటు పార్టీ బలోపేతానికి పనిచేశానని, ప్రత్యర్థి పార్టీల నేతలకు బదులుగా కాంగ్రెస్ నాయకులే తన ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించడం తనను మనో వేధనకు గురి చేసిందని వాపోయారు. మైనంపల్లి వైఖరిపై అధిష్టానం చర్యలు తీసుకోవాలని, ఇన్‌చార్జిని కూడా మార్చాలని కోరారు. కార్యక్రమంలో ఎండీ అశ్వక్, రంజిత్, పరశురాములు, శివ, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

చిన్నకోదూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గోనెపల్లికి చెందిన జంగిటి సుజాత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా గ్రామానికి చెందిన కమలాకర్‌చారి ఆదివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని మనోధైర్యం కల్పించారు.

42 శాతం రిజర్వేషన్లు ఆమోదించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి


అంబేడ్కర్ సర్కిల్‌లో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

సిద్దిపేటకమాన్: రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిద్దిపేట బస్టాండ్ అంబేడ్కర్ సర్కిల్‌లో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ద్వంద వైఖరిని అనుసరిస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఒక న్యాయం, తెలంగాణలో ఒక న్యాయమా అని ప్రశ్నించారు. వెంటనే 4 2శాతం రిజర్వేషన్‌ను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో గోపాలస్వామి, శశిధర్, ఎల్లయ్య, భాస్కర్, నవీన, ప్రశాంత్, రంగారెడ్డి, శోభ, సంజీవ్, భాను తదితరులు పాల్గొన్నారు.

20న బీసీల సింహగర్జన సభ

విజయవంతం చేయాలి: బీసీ నేతలు


నినాదాలు చేస్తున్న బీసీ నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్‌తో 20న దుబ్బాకలోని కోమటిరెడ్డి రజనీకాంత్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించతలపెట్టిన బీసీల సింహగర్జన సభను విజయవంతం చేయాలని వివిధ మండలాలకు చెందిన బీసీ ముఖ్య నాయకులు పిలుపునిచ్చారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో ఆదివారం వారు మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో గద్దె నెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ మాట తప్పారన్నారు. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పర్స కృష్ణ, షేర్ల కైలాష్, బోయ శ్రీనివాస్, కాలేరు శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

దుబ్బాకరూరల్: బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలని పలువురు బీసీ నేతలు డిమాండ్ చేశారు. మండలంలోని కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో బీసీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు బీసీల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. బీసీల ఓట్లతో గద్దె నెక్కి బీసీలను పట్టించుకోక పోవడం బాధాకరమని వాపోయారు. 20న నిర్వహిస్తున్న బీసీల సింహగర్జన సభకు బీసీలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

భవిష్యత్‌లో ఉద్యమ కార్యాచరణ

బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

సిద్దిపేటజోన్: అసంఘటిత కార్మికుల హక్కుల సాధనకు భవిష్యత్‌లో ఉద్యమ కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన చేయనున్నట్టు బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ చెప్పారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా మహాసభల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు సంఘటితంగా పోరాటం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, లేబర్ కోడ్‌లను సవరించాలని, పీఎఫ్, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా రాజయ్య, ఉపాధ్యక్షులుగా చంద్రమౌళి, భూపాల్, శ్రీనివాస్‌చారి, కార్యదర్శిగా రాజిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా మల్లేశం, కవిత, రాజు, శ్రీనివాస్, కోశాధికారిగా కొండల్‌రెడ్డిని ఎన్ను కున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

సీఐ రవికుమార్


కారును తనిఖీ చేస్తున్న సీఐ రవికుమార్

గజ్వేల్ రూరల్: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ రవికుమార్ హెచ్చరించారు. ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో ఆదివారం ఆయన ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. మైనర్ డ్రైవింగ్, రాంగ్ రూటు, మద్యం తాగి వాహనాలు నడపడం, పరిమితి మించి ఆటోలలో ప్రయాణికులను ఎక్కించుకోవడం వంటి వాహనదారులను గుర్తించి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఆల్బెండజోల్ పంపిణీకి ఏర్పాట్లు

మిరుదొడ్డి(దుబ్బాక): స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలల్లో సోమవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ సమీనా సుల్తానా తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పిల్లల్లో నులి పురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని 11 గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 5,742 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. నులి పురుగుల నిర్మూలనకు అధికారులు, పిల్లల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

మాజీ ఎమ్మెల్సీ పరామర్శ


దుబ్బాకరూరల్: కృష్ణోజీ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఫారూఖ్

దుబ్బాకరూరల్: మండలంలోని పలు బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ ఆదివారం పరామర్శించారు. చీకోడ్ గ్రామానికి చెందిన కటికె కృష్ణోజీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనతోపాటు తన కోసం పార్టీలో పని చేసిన కార్యకర్తలు మరణిస్తే చాలా బాధగా ఉంటుందన్నారు. పేద కార్యకర్త చని పోయాడని తెలియగానే మనస్సు చలించి ఆ కుంటుంబ సభ్యులను పరామర్శించినట్టు చెప్పారు. కుటుంబానికి తన వంతు సహాయ సహకారాలు అందించానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తొడ శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

మైనంపల్లి..

గజ్వేల్: మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు గజ్వేల్‌లో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరిని పరామర్శించారు. యాదగిరి తల్లి మల్లమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. విషయాన్ని తెలుసుకొన్న ఆయన ఆదివారం యాదగిరితోపాటు వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నేత చిటుకుల మహిపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన అవసరం

ఎస్‌ఐ రాజేశ్



సిద్దిపేటరూరల్: సైబర్ మోసాల పేరిట మోసపోతున్న క్రమంలో వాటిపై అవగాహన పెంచుకోవాలని, అప్పుడే ఆన్‌లైన్ నగదు మోసాల నుంచి రక్షించుకోవచ్చని ఎస్‌ఐ రాజేశ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్త నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. డబ్బులు కావాలని, అత్యవసరం అంటూ, ఆపదలో ఉన్నానంటూ కంగారు పెట్టేందుకు ప్రయత్నిస్తుంటారని, అలాంటి వాటిని నమ్మితే మోసపోయే అవకాశం ఉందని చెప్పారు. పూర్తిస్థాయిలో నిజనిజాలు తెలుసుకున్న తర్వాతనే స్పందించాలని సూచించారు.

అల్లుకున్న 'నిర్లక్ష్యం'

- పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు


ప్రమాదకరంగా ఉన్న మినీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


గొల్లపల్లిలో విద్యుత్ స్తంభాన్ని అల్లుకున్న పిచ్చిమొక్కలు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలం గొల్లపల్లిలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అల్లుకున్నాయి. అలాగే రహదారి నుంచి గ్రామానికి వెళ్లే దారి పక్కనే ఉన్న మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏకంగా సిమెంట్ గాజులపై అమర్చారు. అది కిందికి పడిపోయే పరిస్థితిలో ఉంది. ప్రజలు, కాలనీవాసులు వివిధ పనుల నిమిత్తం ఈ ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే విద్యుత్ స్తంభం పూర్తిగా మొక్కలతో అల్లుకుంది. ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశం ఉందని అటువైపు వెళ్లే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఈత చెట్ల పెంపకానికి భూములివ్వాలి

కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కల్హేర్(నారాయణఖేడ్): ఈత, తాటిచెట్ల పెంపకానికి ప్రతి కల్లుగీత సొసైటీకి ఐదెకరాల ప్రభుత్వ భూమి ఇవ్వాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం కల్హేర్ మండలం మార్డిలో ఆ సంఘం ఆధ్వర్యంలో అమరవీరుల యాదిలో గీతన్నల సామాజిక చైతన్య యాత్ర సభ నిర్వహించారు. గౌడ సంఘలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మొక్కల సంరక్షణ కోసం డ్రిప్పు, బోరు మంజూరు చేయాలని కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలోని నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమ ప్రారంభించాలని, హైదరాబాద్‌లో నీరా కేఫ్‌ను టెండర్ వేసి వచ్చిన ఆదాయంతో గీత కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఈ నెల 18న సంగారెడ్డిలో యాత్ర ముగింపు సభ జరగనుందని చెప్పారు. గౌడ, కల్లుగీత కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నేతలు రమేష్‌గౌడ్, అంజగౌడ్, జంగన్నగౌడ్, ప్రసాద్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు మల్లేశంగౌడ్, కుమార్ గౌడ్. సంఘం నాయకులు నరసింహగౌడ్, భూమాగౌడ్ పాల్గొన్నారు.

ఉత్సహంగా లాంగ్ రన్



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో ముప్పా ఇంద్రప్రస్థ విలాస్ అసోసియేషన్, హైదరాబాద్ రన్నర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం లాంగ్ రన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

చెరువులు.. కుంటల్లో జలసిరి


మత్తెడ పోస్తున్న కల్లెపెల్లి నర్సింహులు చెరువు

మండలంలో ఆదివారం కురిసిన వర్షాలకు పలు చెరువులు, కుంటలు, కల్వర్టులలో వరద నీరు చేరి జలకళ సంతరించుకొంది. కల్లెపెల్లి నర్సింహులు చెరువు, రామసాగరం తుమ్మల చెరువులు మత్తెడ పోస్తున్నాయి. గూడెం-తాల్లల్లపల్లె గామాల శివారులోని కల్వర్టులో ఉధృతమైన నీటి ప్రవాహం వల్ల రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాల కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - బెజ్జంకి(సిద్దిపేట)


గూడెం కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్న నీరు

నర్సారెడ్డిపై దళితనేతల ఫిర్యాదు

గజ్వేల్: గజ్వేల్‌లో ఈ నెల 3న నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ సందర్భంగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము విజయ్‌కుమార్‌ను కులం పేరుతో దూషించి, దాడికి పాల్పడిన డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ఆదివారం బాధితుడితో కలిసి దళిత సంఘాల నేతలు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ దళితుల ఎదుగుదల చూసి ఓర్వలేకే దాడులు జరుగుతున్నాయని వాపోయారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు కుమార్, కృష్ణ, రాజు, డీబీఎఫ్ మెదక్‌జిల్లా అధ్యక్షుడు సంజీవ్ పాల్గొన్నారు.